కథ

# కొత్త సిలబస్

**పెళ్ళి కుదిరింది.**

**వరుడు మురళి విజయవాడలో బ్యాంక్ ఉద్యోగి. వధువు రాజమండ్రిలో రిటైర్ అయిన శంకరం మాస్టారి కూతురు.**

పెళ్ళి కోసం శంకరం మాస్టారు మూడు లక్షలు దాచారు. కట్నం రెండున్నర లక్షలు. లాంఛనాలు పాతిక వేలు. బండికోసం యాభైవేలు అని బేరం కుదిరింది. ఆపైన పెళ్ళి ఖర్చులు ఉండనే ఉన్నాయి. దాచిన డబ్బు సరిపోదు. యాభై వేలు అయినా అప్పుచేయాలి.

కట్నం, లాంఛనాల డబ్బు ముందుగానే అందజేసి ముహూర్త సమయానికి బండి బాపతు యాభైవేలు ఇస్తానని కాబోయే వియ్యంకుడు రాఘవయ్యకి మాట ఇచ్చి ఇంటి పత్రాలు తీసుకుని అప్పుకోసం శేఠ్‌జీని కలిశాడు శంకరం.

ఆ శేఠ్‌జీకి మాస్టారి నిజాయితీ తెలిసినా, వ్యవహారం వ్యవహారమే. ఆ పత్రాలు సరియైనవి అవునో కాదా నిర్ధారించుకోవాలని శేఠ్‌జీ ఆ విషయం నేరుగా చెప్పకుండా "అంత డబ్బు రెడీగా లేదు. బ్యాంక్‌నించి తెప్పించి రేపు మీ ఇంటికే పంపుతాను. మీరు మళ్ళీ రానక్కరలేదు" అన్నాడు.

కానీ రెండు రోజులు గడిచినా సొమ్ము రాలేదు. ఎల్లుండే పెళ్ళి. శేఠ్‌జీ ఇంటికెళ్ళాడు శంకరం. దురదృష్టం. తండ్రి చనిపోయాడని ఫోన్ రావడంతో శేఠ్‌జీ కుటుంబంతో ఆదరాబాదరా అహ్మదాబాద్‌కి వెళ్ళిపోయాడట. రెండు వారాలకు గాని రాడు. పత్రాలు ఆయన వద్ద ఉండిపోవడంతో మరోచోట అప్పు పుట్టదు. పెళ్ళి ఖర్చులకు ఇబ్బంది లేకపోయినా బండి బాపతు డబ్బు సర్దుబాటే సమస్య.

వియ్యంకుడ్ని మరో రెండు వారాల గడువు కోరాలని నిర్ణయించుకున్నాడు శంకరం.

★ ★ ★

పెళ్ళిరోజు..

సమయం రాత్రి పది.

ముహూర్తానికి ఇంకా నలభై రెండు నిముషాలే వ్యవధి.

వధూవరులు పీటల మీద కూర్చున్నారు. పంతులు గారు మంత్రాలు చదవుతున్నారు. భోజనాల హాలులోను, పందిరిలోనూ అంతా హడావిడి. హఠాత్తుగా-

"ఆపండి!" రాఘవయ్య గర్జన.

మంగళవాయిద్యాలు ఆగిపోయాయి. మంత్రాలు ఆగిపోయాయి. భోజనం చేస్తున్న చేతులూ, వడ్డించేవారి కాళ్ళూ ఆగిపోయాయి. రాఘవయ్య చేతులు పట్టుకుని బ్రతిమాలుతున్నాడు శంకరం. చుట్టూ మూగిన బంధుమిత్రులూ బ్రతిమిలాడుతున్నారు. రెండు వారాలే కదా, ఓపిక పట్టండి అని నర్దిచెబుతున్నారు.

"సరే, రెండు వారాల తర్వాతే మరో ముహూర్తం పెట్టుకుందాం... ఒరే మురళీ పీటల మీదినుంచి లేవరా" రాఘవయ్య విశ్వరూపం ప్రదర్శించాడు.

"అలా అంటే ఎలా! కరుణ చూపండి. పెళ్ళి జరగనివ్వండి. బకాయి చేతికి అందాక అప్పుడే అమ్మాయిని కాపురానికి తీసుకువెళ్ళవచ్చు" మధ్యే మార్గం సూచించారు కొందరు.

"ఇన్ని కబుర్లు చెప్పే బదులు మీరంతా చందాలు వేసుకుని ఆ డబ్బు ఇప్పుడే ఇవ్వొచ్చుగా!" రెండాకులు ఎక్కువే చదివాడు రాఘవయ్య.

చందా అనగానే అందరూ చల్లగా జారుకోగా-

"నేనిస్తాను"

గంభీరంగా వినిపించిన ఆ స్వరం వైపు చూశారందరూ. అక్కడ సఫారీ సూట్‌లో హుందాగా విష్ణు. అతడు శంకరం మాస్టారి శిష్యుడే. ప్రస్తుతం హైదరాబాద్‌లో కంప్యూటర్ సంస్థ నిర్వహిస్తున్నాడు. ఫ్రెండ్ ఇంట్లో దిగి అరగంట క్రితమే వచ్చి మాస్టారికి శుభాకాంక్షలు చెప్పి భోజనం చేస్తూ రభస విని వచ్చాడు.

అతడు జేబులోంచి చెక్‌బుక్ తీసి పేరు అడిగాడు.

రాఘవయ్య పేరు చెప్పకుండానే "ఓహో! ఇదో నాటకమా. చెక్కుతో మోసపోవడానికి నేనో వెధవలా కనిపిస్తున్నానా. నీ ఖాతాలో డబ్బుందో, లేదో చెక్కు బౌన్స్ అయితే నేను నెత్తిన చెంగేసుకోవాలి. ఖాతాలో డబ్బున్నా, ఆ చెక్కు మారి నా ఖాతాలో జమపడడానికి రెండు వారాలు పట్టొచ్చు. అదేం కుదరదు. నాకు క్యాష్ కావాలి. హార్డ్ క్యాష్" రంకెలేశాడు రాఘవయ్య.

అదృష్టం. విష్ణు వద్ద ఎ.టి.ఎం కార్డు ఉంది. దానికి సంబంధించిన బ్యాంక్ కళ్యాణ మంటపానికి కిలో మీటర్ దూరంలో ఉంది. అక్కడకు వెళ్ళి పావుగంటలో క్యాష్‌తో తిరిగి రావచ్చు. అప్పుడు టైం పదింపావు.

"నువ్వెళ్ళి తిరిగి రాకపోతేనో?..నేనూ నీతో వస్తా" అన్నాడు రాఘవయ్య.

ఇద్దరూ స్కూటర్ మీద బయలుదేరారు. అప్పటికే ఏటియం వద్ద ముగ్గురు క్యూలో ఉన్నారు. తమ వంతు వచ్చేసరికి పదిన్నర దాటింది. క్యాష్ తీసుకుని అక్కడున్న కవరులో యాభై వేలూ పెట్టి రాఘవయ్యకి ఇచ్చాడు విష్ణు. అయితే ఎంత వేగంగా వెళ్ళినా ముహూర్తం టైంకి కళ్యాణ మంటపానికి చేరుకోవడం అసాధ్యం. అక్కడందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తూ ఉంటారు. జేబులోని సెల్ ఫోన్ తీసి ఆయనకిస్తూ "డబ్బు అందింది పెళ్ళి జరిపించమని మీ వాళ్ళకి ఫోన్ చేయండి. మనం కాస్త ఆలస్యంగా వెళ్ళినా ఫర్వాలేదు" అన్నాడు విష్ణు.

డబ్బు కవర్ షర్టు జేబులో పెట్టుకుంటూ తమ్ముడికి ఫోన్ చేశాడు రాఘవయ్య.

ఇద్దరూ స్కూటర్ మీద బయలుదేరారు. అయితే-

ఒక చేతిలో సెల్ పట్టుకుని చెవికి ఆనించి వింటూ, రెండో చేతితో స్కూటర్ నడుపుతూ ఎదురుగా దూసుకొస్తున్న యువకుడు హఠాత్తుగా వీళ్లని గమనించి కంగారుపడి వెనకసీటులో కూర్చున్న రాఘవయ్యకు డ్యాష్ ఇవ్వడం ఆయన అంత దూరంలో కిందపడడం, మరి కొంత దూరంలో స్కూటర్‌తో సహా విష్ణు క్రిందపడడం, ఆ యువకుడు పారిపోవడం క్షణంలో జరిగిపోయాయి.

విష్ణుకి అక్కడక్కడ గీరుకుపోయింది. అతడు లేచి స్కూటర్ నిలబెట్టి పరీక్షించాడు. ఫర్వాలేదు. అది కండిషన్‌లోనే ఉంది. గబగబా వెళ్ళి రాఘవయ్యని లేవదీశాడు. అక్కడంతా మసకచీకటి. ఆయనకూ పెద్దగా దెబ్బలు తగలలేదు. అయితే కాళ్ళు పట్టేశాయి. కష్టంగా నిలబడి కాళ్ళు విదిలించి స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. అలా పది నిముషాలు వేస్ట్.

మొత్తానికెలా అయితేనేం వాళ్ళు కళ్యాణ మంటపానికి చేరుకునేసరికి టైం పదకొండు. అప్పటికే మాంగల్యసూత్రధారణ అయిపోయింది. పెద్దలు వరుసగా వెళ్ళి పీటల మీది నూతన దంపతుల్ని ఆశీర్వదిస్తున్నారు. రాఘవయ్య కూడా ఆశీర్వదించి, తన బంధువులకు యాక్సిడెంట్ గురించి చెబుతూ జేబు తడుముకుని...షాక్...షాక్...యాభై వేల కవరు మాయం!

అటు తిరిగి ఇటు తిరిగి ఆయన అనుమానం విష్ణు మీద బలపడింది.

"నువ్వే..నువ్వే డబ్బు దొంగిలించావ్! నీ జేబులు చెక్ చేయాలి" రాఘవయ్య అరుస్తూ ముందుకు చాచిన చేతిని ఒడిసి పట్టుకుని "నా జేబులో చెయ్యి పెట్టావంటే ఆ చేతిని విరిచి పారేస్తా. రాస్కెల్" గర్జించాడు విష్ణు.

"నన్ను రాస్కెల్ అంటావా" అని ఆయనా,


"నన్ను దొంగ అంటావా" అని విష్ణు గుంజుకున్నారు.

మళ్ళీ పెళ్ళి తంతుకు విఘ్నం. చుట్టూ మూగిన జనం గుసగుసలు.

"నన్ను దొంగ అన్న తర్వాత నీకెందుకురా మర్యాద ఇవ్వాలి. దొంగతనం చేయాల్సిన ఖర్మ నాకు పట్టలేదు. నువ్వే ఆ డబ్బు బంధువులకిచ్చేసి ఇంకో యాభై వేలు గుంజడానికి నాటకం ఆడుతున్నావేమో. ఎవరికి తెలుసు.

నా జేబులు చెక్ చేసే ముందు నీ బంధువుల జేబులూ, సూట్‌కేసులూ చెక్ చేయాలి. అంతవరకూ ఎవ్వర్నీ బయటకు పోవద్దని చెప్పు. జేబులు చెక్ చేయాల్సింది నువ్వూ, నేనూ కాదు. పోలీసులు. ఫోన్ చేసి పోలీసుల్ని రప్పించు'' వీరావేశంతో ఊగిపోతూ గర్జించాడు విష్ణు.

తనకంటే గట్టిగా అరుస్తూ ఎదురుదాడికి దిగిన విష్ణు రౌద్రాకారం చూసి ఖంగుతిన్న రాఘవయ్య సైలెంట్ అయిపోయాడు. అదే అదనుగా విష్ణు మరింత విజృంభించాడు.



"అసలు నీకు డబ్బు ఇవ్వాల్సిన అవసరమే లేదు. ఏటి ఎంకి అని చెప్పి స్కూటర్ మీద నిన్ను తిన్నగా పోలీస్ స్టేషన్‌కి తీసికెళ్ళి కట్నంకోసం వేధిస్తున్నావని రిపోర్ట్ చేస్తే చాలు నిన్ను జైల్లో తోసేవారు. ఇక్కడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాకు తెలిసినవాడే. మాస్టారి ముఖం చూసి నిన్నొదిలాను. డబ్బిచ్చాను. నన్నే దొంగ అంటావా! పోలీసుల్ని పిలిచి సోదా చేయించు" అరుస్తూ సెల్‌లో ఏవో నెంబర్లు నొక్కి ఆయన చేతిలో పెట్టాడు.

అప్పటికి తేరుకున్న పెళ్ళికొడుకు మురళి చటుక్కున అక్కడికొచ్చి సెల్ లాక్కొని ఆపేశాడు. పెళ్ళికొచ్చిన మిత్రులందరూ తనని చూసి నవ్వుకుంటూ ఉంటే భరించరాని అవమానంగా ఉందతనికి. నిజానికి అతనికీ, తండ్రికీ ఎప్పుడూ చుక్కెదురే. తనకి కట్నాల మీద మోజులేదు. కాని తండ్రి అతని నోరు నొక్కేశాడు. తనకి బండి వుంది. మళ్ళీ బండి కోసం డబ్బు లాగడం ఎందుకని అతని వాదన. "పిలైనంత ఇప్పుడే గుంజాలి" అని తండ్రి గదమాయింపు. తండ్రి దురాశ, కక్కుర్తి కొడుక్కి ఏవగింపుగా ఉన్నా ఎప్పుడూ తండ్రిని ఎదిరించలేదతడు. కాని ఇప్పుడు శుభమా అని పెళ్ళి చేసుకుంటూ ఉంటే నానా రభస చేసి పరువు తీస్తున్న తండ్రి మీద కోపం పొంగిపొరలింది. "నాన్నా! జరిగిన రభస చాలు. ఇంక నోరు మూసుకుని కూర్చోండి" అని అరిచేశాడు.

నిశ్చేష్టుడయ్యాడు రాఘవయ్య.

ఆయన భార్య అక్కడికొచ్చి "ఇంక చాలు ఊరుకోండి. రభస చేస్తే ఆ అబ్బాయి నిజంగానే పోలీస్ రిపోర్ట్ ఇచ్చేట్టున్నాడు. ఖర్మ! యాక్సిడెంట్ జరిగిన చోటే కవరు పడిపోయి ఉంటుంది. ఏ అదృష్టవంతుడికో దొరికి ఉంటుంది'' అంటూ ఆయన నోరు నొక్కేసింది. అంతే మిగిలిన పెళ్ళి తంతు సజావుగా జరిగింది.

శంకరం మాస్టారు శిష్యుడ్ని కౌగలించుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

★ ★ ★

కథ అక్కడితో అయిపోలేదు.

పెళ్ళయిన పది రోజులకు అహ్మదాబాద్ నుంచి వచ్చిన శేర్‌జీ డబ్బు ఇవ్వకుండా హడావిడిగా వెళ్ళిపోయినందుకు సారీ చెబుతూ మాస్టారింటికి డబ్బు పంపాడు. విష్ణు ఇచ్చిన విజిటింగ్ కార్డులోని నెంబర్‌కి ఫోన్ చేసి డబ్బు ఎలా పంపమంటావ్ అని అడిగాడు శంకరం.

"నేనే రెండ్రోజుల్లో అక్కడికొచ్చి తీసుకుంటా" అన్నాడు విష్ణు.

చెప్పినట్టే రెండు రోజుల్లో వచ్చిన విష్ణుకి డబ్బు ఇచ్చేశాడు శంకరం. ఆయన భార్య కాఫీ ఇచ్చి విష్ణుని పొగడ్తల్లో ముంచేసింది. అతడు నవ్వుకుంటూ కోటు జేబులోంచి తనఖా పత్రాలు తీసి మాస్టారికిస్తూ "శేర్‌జీకివ్వాల్సిన అప్పు తీర్చేసాను'' అన్నాడు వినమ్రంగా.

శంకరం దీర్ఘంగా నిట్టూర్చి "నువ్వు నన్ను మళ్లీ మళ్ళీ ఋణగ్రస్తుడ్ని చేస్తున్నావు బాబూ'' అన్నాడు.

"మీరు ఎవరికీ దమ్మిడీ కూడా ఇవ్వనక్కరలేదు. మీరు రుణగ్రస్తులు కారు మాస్టారూ'' చిద్విలాసంగా చిరునవ్వు చిందించాడు విష్ణు.

అయోమయంగా చూస్తూండిపోయాడు శంకరం మాస్టారూ, ఆయన భార్య.

అప్పుడు చెప్పాడు విష్ణు-

పెళ్ళిరోజు యాక్సిడెంట్ జరిగినప్పుడు ఆ మసక చీకటిలో కిందపడిన రాఘవయ్యని లేవదీస్తున్నప్పుడు ఒక చిలిపి ఆలోచన వచ్చిందట విష్ణుకి. ఆయన జేబులోని కవర్ సంగ్రహించి తన జేబులో వేసుకున్నాడట. ఆ విషయం చెప్పి పకపకా నవ్వేశాడు విష్ణు. కాని మాస్టారు నవ్వలేదు. "నువ్వు తప్పుచేశావ్ బాబూ! అప్పుచేసి వాళ్ళ డబ్బు వాళ్లకిచ్చేస్తా'' అన్నాడు గంభీరంగా.

విష్ణు నవ్వడం ఆపి "పాఠాలూ, సిలబస్ తప్ప లోకరీతి ఎరుగని అమాయకులు మాస్టారూ మీరు. ఆయనకు మీరు డబ్బిస్తే మెచ్చుకోడు సరికదా మనం కలిసి ఆడిన నాటకం అనుకుంటాడు. తనకు జరిగిన అవమానానికి మీ అమ్మాయి మీద కక్ష తీర్చుకుంటాడు. మీ అమ్మాయి కాపురంలో నిప్పులు పోయాలనుకుంటే సరే. మీ ఇష్టం'' అన్నాడు. శంకరం మాస్టారు ఆలోచనలో పడ్డారు.

"అపకారికి ఉపకారం చెయ్యమనడం మీ పాఠం. పాత సిలబస్! కాని మంచివాడికి మంచి చెయ్. చెడ్డవాడికి చెడు చెయ్ అనేది నేటి పాఠం. కొత్త సిలబస్. తమాషా ఏమంటే మన పురాణాల్లో పాత, కొత్త సిలబస్‌లు రెండూ ఉన్నాయి. భోళాశంకరుడు పాత సిలబస్ ప్రకారం రాక్షసులకు కూడా వరాలిస్తే ఆ విష్ణుమూర్తి మాత్రం కొత్త సిలబస్ ప్రకారం శిష్టులను రక్షించి, దుష్టులను శిక్షించాడు. అదే విధంగా ఈ విష్ణు కూడా ఆ దుష్టుడికి యాభైవేల గుణపాఠం చెప్పాడు'' తనని సమర్థించుకుంటూ గురువుకే పాఠం చెప్పాడు విష్ణు.

అయినా మాస్టారిలో అపరాధభావన తొలగిపోలేదు.

"ప్రతి పనికీ సమయం, సందర్భం ఉంటాయి మాస్టారూ. మీరు వాళ్లకి సొమ్ము ఇవ్వడానికిది సమయం కాదు. మనవడు పుట్టనివ్వండి. అప్పుడు పుట్టినరోజు కానుకగా యాభై వేలు మీ అల్లుడికి అందజేసి జరిగిందంతా అతనికి నేనే వివరిస్తాను. అంతవరకూ ఓపిక పట్టండి'' అన్నాడు.

భోళాశంకరం ఇంకేం చేయగలడు. ★

**ప్రఫుల్లచంద్ర**